# అత్తాకోడళ్లు

అందాలభరిణె ఎవరంటే మా వదినే నని చెప్పొచ్చు. చంపకి చారెడు కళ్ళతో, పసిడి ఛాయతో మిసమిసలాడి పోతుంటుంది. స్వభావం కూడా చాలా మంచిది. కాని ఒచ్చిందల్లా ఒకటే చిక్కు. ఆమెని ఎవరూ పల్లెత్తుమాట అనకూడదు. అంతా తన యిష్ట ప్రకారమే జరగాలంటుంది. అందరితోను అన్నివిషయాల్లోనూ చాలా మంచిగా ప్రవర్తించే అమ్మ, కోడలిదగ్గిర కొచ్చేసరికి ఎక్కడలేని ఒడితనం ఒలకబోస్తుంది.

నిజంగా వీళ్ళిద్దరితో వేగటం నాకు చాలా చికాకు. ఏదో చిలిపి పని చేసో, పెంకి జవాబు చెప్పో వదినె అంటించేది. అగ్నిహోత్రం దాంతో పెద్ద ప్రళయం లేవదీసేది అమ్మ నా కెందుకీ గొడవ అని పోయేదాన్ని. కాని ఇట్టే గడిచిపోయేది ఆరు గంటల కాలం కాలేజీలో. మళ్లీ ఇంటికొచ్చేసరికి కార్యక్రమం లక్షణంగా జరుగుతూండేది. ఇంతా చేస్తే ఏం లేదు. పువ్వులు చేతిమాల కడతానని వదినె, 'ఒద్దు, కాలిమాల కట్టు'మని అమ్మ! జడలోకి అది బాగుంటుందని ఆమె; ముడిమీదికి ఇది అందం అని ఈమె! 'పోనీ మీమాట్టుకు అలా చేస్తాన'ని సరిపెట్టచూసేది వదినె. 'ఇంట్లో నలుగురూ ఓలా ఉండక పువ్వులు పెట్టుకోవడం దగ్గిర్నించి భేదమే చేస్తారు' అని అమ్మ ఉసుక్కునేది. ఇంతే కారణం. ఇదే కాదు.

అసలు వీళ్ళిద్దరి కలహాకారణాలు ఎప్పుడూ ఇంతమాత్రంగానే ఉండేవి. ఏదో ఒక దానిమీద వీళ్ళిద్దరికీ అలా జరుగుతూనే ఉండేది రభస. పోనీ నేను పోయి ఎవరిప్రక్క మాట్లాడదామన్నా భయమే. ఇటొస్తే అమ్మ 'నువ్వూ తయారవుతున్నావు' అని నన్నే

**కె. యస్. దేవి**

తిడుతుంది పోనీ అని అటు పోతే, 'ఆడబడుచువైనందుకు నేర్చుకున్నావులే' అంటుంది వదినె. దేవుడా! ఇంక ఈ ఇంట్లో శాంతి ఉండదు కాబోలు అనిపించేది. ముఖ్యంగా నాకు. ఎంచేతంటారా అన్నయ్య, నాన్నగారు అంటే మా యింట్లో అందరికీ హడలే. వాళ్ళింట్లో ఉన్నంతసేపూ చివరికి మా చెల్లి కూడా కిక్కురుమనదు. తరవాతా? మా అందరికీ సంపూర్ణ స్వాతంత్ర్యం ఒచ్చేసేది. వాళ్లు పొద్దున్న 9 గంటలకి ఆఫీసుకు వెళ్ళితే, మళ్ళీ రాత్రి 10 గంటలకే ఇంటికి రావటం. ఎటొచ్చీ ఉన్న చిక్కల్లా నాకే ఒచ్చిపడింది. పోనీ పెద్దది, ఏదో అంటుంది అని వదినె ఊరుకున్నా బాగున్ను. కాని ఈమె మాత్రం ఏం తక్కువ తిన్నది? అలా అని - మేడి పండు చూడ మేలిమై యుండును, పొట్ట విప్పి చూడ పురుగులుండు' అన్న రకం కాదు సుమండీ. స్వచ్ఛమైన స్వభావం ఉన్నదే. కాని అత్తవారింట్లో కాపురం చేస్తున్నా, చిన్నతనం చిలిపిచేష్టలుమాత్రంపోలేదు.



గుసగుసలు
ఫొటో: —జి. ఎన్. భూషణ్ (మద్రాసు.)

# ★ అత్తాకోడళ్ళు ★

ఏ పనైనా తనకి నచ్చినట్లు కాక ఇతరుల ఇష్టప్రకారం చెయ్యటం బానిసతనమని అనుకుంటుంది.

ఆ రోజు, బహుశా, మంగళవారం అనుకుంటా. జోరుగా వర్షం కురుస్తోంది. ఇంటర్‌వల్లో ఇంటికెళ్ళ లేక కాలేజీకే కాఫీ తెప్పించుకుని తాగే. కాని సాయంత్రం ఇంటికెళ్ళక తప్పదుగా. వదినె కారు కూడా పంపింది వేగం రమ్మని. సరే. ఎలాగూ తప్పదు ఇంక అని బయల్దేరాను-మా వాళ్ళ కయ్యాలు ఆసాంతం వినడానికి చెవులు సరి చేసుకుంటూ.

వీధిగుమ్మంలోనే వదినె ప్రత్యక్షమయింది. సావిట్లో అమ్మగారి దర్శనమయింది. కాని వీళ్ళిద్దరి మధ్య మామూలుగా జరిగే జగడంతో తుల్యమైన సంభాషణ ఏదీవిని పించకపోయేసరికి ఆశ్చర్యపోయా. 'వేగం డ్రెస్సు వేసుకో సుధా. సినీమాకి పోదాం' అంది వదినె 'నీవు సిద్ధంకావే శశీ. దానికి కాఫీ నేను ఇస్తా' అంది అమ్మ. ఓ! మైగాడ్. ఏమిటీ వైపరీత్యం అనుకుంటూ ఐదు నిమిషాల్లో రెడీ అయ్యాను.

కారు మెయిన్ రోడ్డుమీదుంచి వేగంగా సాగిపోతూంది. 'ఏ సినీమాకి' అని అడిగా వదినెని. 'సంసారానికి పోదాం' అంది ఆమె. 'కాదు దీక్షకి' అంది అమ్మ. 'సంసారమే బాగుంటుం' దంది వదినె. మరేం. మళ్ళీ మామూలు వ్యవహారం ప్రారంభమవుతుం దనుకున్నా. పూర్తిగా దానికి వ్యతిరేకం అయింది! 'సరే. దానికే పోదాం' అంది అతి సరళస్వభావం తెచ్చుకుంటూ అమ్మ. నిజంగా నేను తల క్రిందులై పోయాను - అకారణంగా ఎందుకిలా ఇద్దరి మనసులూ ఏకమయిపోయాయి అని.

సినిమా చూస్తున్నానే కాని నా మనసులో అంతా వీళ్ళ వింత ప్రవర్తనే మెదులుతోంది. ఉండబట్టలేక ఇంటర్‌వల్లో అడిగేసే వదినెని 'అమ్మని ఏం మందుపెట్టి లొంగదీసుకున్నావు' అని. ఆమె నవ్వుతు 'నేనేం చెయ్యలేదు సుధా. ఆవిడే సబబుగా మాట్లాడటం మొదలెట్టారు. అనవసరంగా దెబ్బలాడటమెందుకని నేను సరిపెట్టుకుంటున్నా' అంది. ఆ సమాధానం నాకు బొత్తిగా నచ్చలేదు.

"ఎంతసేపట్నించీ ఈ సయోధ్య?" అని అడిగాను.

ఈమాటు నన్ను చూసి నాలుక వెళ్ళబెట్టి వెక్కిరించింది వదినె. "అయిదు గంటలనించి" అంది.

అయిదు గంటలకి ఏం జరిగి వుంటుందా అని ఆలోచించా. ఎంతకీ బోధపడలేదు. అడిగేశా.

"అయిదు గంటలకి ఏం జరిగిందేం?"

వదినె నవ్వేసింది. "ఈమధ్య మీ స్కూల్లో నాటకం వేశారు జ్ఞాపకం వుందా?"

"ఆ"

"అందులో కథేమిటి?"

"కథేమిటా?" జ్ఞాపకం తెచ్చుకున్నాను. అందులో అత్తాకోడళ్ళు తగువులాడుకుంటారు. చివరికి తగువులు మానుకుని సుఖపడతారు.

"ఆ! తెలిసింది" అన్నాను. "అయితే అమ్మకి మనమడో?"

వదినె నా వీపుమీద చరిచింది. మెల్లిగా చెవిలో చెప్పింది. "ఆ సంగతే అత్తగారికి అయిదు గంటలకి చెప్పాను."

"అమ్మ దొంగా" అని వదిన్ని వీపుమీద కొట్టబోయి అంతలో నే చెయ్యి దించేశాను. ★



అన్ని చోట్ల ఏజంట్లు కావలెను.

"డాక్టరు పాల్ గారి లోటస్ తేనె"
కంటిలో పువ్వు వగైరా కంటిజబ్బులకు ప్రకృతి సిద్ధమైన సమ్మకము, నిరపాయమైన మందు. కంటిచూపు వృద్ధి చేయును 1 డ్రాం. రు. 2; 2 డ్రాములు రు. 3/-, 4 డ్రాములు రు. 5/-
అపాలో కంపెనీ,
286, నేతాజి సుభాష్‌చంద్రబోస్‌రోడ్డు, మద్రాస్-1